లీలా రంగం

వేలాల సుబ్బారావు (విషయసూచిక నుండి)

"శ్రీమంతులైన మామగారి సన్నిధికి ప్రణామపురస్సరంగా రంగడు చేయు విన్నపములు:

చెన్నపట్నం చేరగానే వుత్తరం రాస్తానని చెప్పివచ్చి ఇన్నినాళ్లు గడిచిపోయినప్పటికీ నా సమాచారం తెలిపాను కానని అమ్మ బెంగపెట్టుకొని ఉన్నదని అయ్యారుగారి ద్వారా మీరు రాసిన జాబు అందెనది. ఈ నా వుత్తరం ఆమెకు చూపించి నా విషయమై నిశ్చింతగా వుండమని చెప్ప కోర్తాను. మీ అందరి ఆశీర్వాదంవలన, దైవానుగ్రహంవలన నే నిక్కడ క్షేమంగా ఉన్నాను. నేను వచ్చిన పని నిమిత్తం నా శక్తివంచన లేకుండ ప్రయత్నం చేస్తున్నాను. లాయలా కాలేజిలో సీటు దొరికింది కాని భోజనానికీ, ఉండడానికీ ఇంకా వసతి దొరక లేదు. హాస్టల్లో ఉండి అక్కడి ఖర్చును భరించడం నా వంటివాళ్లకు చాలాకష్టం. నే నక్కడ ఆలోచించుకొని వచ్చినలాగే శ్రీయుతులైన కాశీనాథుని నాగేశ్వరరావుగారిని దర్శనం చేయడానికి వారి ఆఫీసు కెళ్లాను ఇవ్వాళ మధ్యాహ్నం. ఆఫీసు దగ్గిర చేరేటప్పటికి సుమారు ఒంటిగంట కావచ్చింది. పంతులుగారు మేడమీద ఉన్నారని తెలిసి అక్కడికి వెళ్లాను. వీరి ఆఫీసు రూం ఝోలీ చెక్కల* ఆఫీసుల్లాగు కళ్లను భ్రమింపచేసేది కాక వారి నిరాడంబరం సూచించే ఒక చిన్నగది. పట్టుమని ఒక్కమాటుగ పదిమందికంటే ఎక్కువ పట్టరు ఆ గదిలో. పంతులుగారి ఎదుట ఉన్న మేజాబల్లమీద ఒక పెద్ద ఉత్తరాలరాశి పడివుంది. వారొక్కొక్కదాన్నే విప్పిచూస్తూ ముఖ్యమైనవాటి కన్నిటికీ జవాబు రాయమని క్లర్కుతో చెప్పుతూ తక్కిన వాటి నన్నింటినీ బుట్టదాఖల్ చేస్తున్నారు. అదే సమయంలో హెడ్ ఆర్టిస్టు వచ్చి కలకత్తా రంగూన్ పట్నాల్లో కొత్తగా ఏర్పాటుచేసిన అమృతాంజనం బ్రాంచి డిపోల నిమిత్తం తయారుచేసిన కొత్త కొత్త ప్రకటనల నమూనాలను, చిత్రాలనూ చేతి కందివ్వగా వాటిని దేరిపారచూస్తూ నవ్వుతూ బాగా ఉన్నాయని మెచ్చుకొంటున్నారు. ఇంతలో హెడ్ అకౌంటెంటు వచ్చి ఫలానావారికి బోనసు ఇవ్వమంటారా వద్దంటారా అంటే ఇవ్వండని చెబుతూ వుండగానే ఆంధ్రపత్రికా ఫోర్మన్ వచ్చి కొత్తగా తెప్పించిన మెషీన్ సిలెండర్ తృప్తికరంగా పనిచేయడం లేదనగా దాని కేదో ఉపాయం తెలియచెబుతూవున్న తరుణమందే ఒక కుర్రవాడు గబగబవచ్చి గుప్పెడు ప్రూఫ్ కాగితాలను వారి ముందు బల్లమీదబెట్టి పరుగెత్తాడు. వానిలో నొకదాన్ని తీయబోతున్నారు. ఇంతలోనే మేనేజరు వచ్చి కొత్తగా ఎక్స్టెండు చేయదలచుకొన్న బిల్డింగుకు వలసిన ఖర్చు విషయమై పరామర్శ చేస్తూవున్న సమయమందే ఇంజనీరొకరు వచ్చారు, కొత్తగా తవ్వించదలచుకొన్న చెరువు యొక్క ప్లానును గురించి ఆలోచించడానికి........

వారి టేబులుకు ఈవలగా ఉన్న పేముసోఫా మీద, దానికి వెనకగావున్న కుర్చీలమీద పెద్దమనుషులు కొందరు కూచొని ఉన్నారు. పంతులుగారి కెప్పుడు అవకాశం దొరుకుతుందా, యెప్పుడు వారితో మాట్లాడుదామా అని మహా ఆత్రంతో ఉన్నలాగు నోట జెప్పకపోయినా మొగాలు వెల్లడిస్తూనే ఉన్నాయి. కాని అవకాశం నిమిత్తం డిక్షనరీలో వెతుక్కోవలసిందే గాని

* ఝోలీ చెక్కలు: ఝోలీ=జోలె, చెక్క=ఎత్తుట-జోలెలు చంక తగిలించుకొని నడిచేవాళ్లు. ఒకవేపు అసలు హక్కుదారులైన స్వదేశీయులను పీడిస్తూ వారి కష్టార్జితంమీదనే రాజభోగా లనుభవిస్తూ తుదకు కాలము వచ్చినయెడల నెత్తిన గుడ్డ వేసుకొని జోలెలను చంక దగిలించుకొని వారివారి దేశాలకు బరుగెత్తే విదేశీయుల కీనామము రూఢియైయున్నది.

పదికాగడాలుపెట్టి వెదికినా వారిదగ్గరమాత్రం దొరక జాలదని నాకు నిమ్మళంగా తరువాత తెలిసింది. క్రమ క్రమంగా అనుభవంమీద. కొంచెమంటే కొండంత చేసి రాస్తున్నా ననుకోనేరు సుమీ! ఉన్నదాన్ని ఉన్న లాగూడా రాయలేనేమో అని నా భయం. వీరు ఆఫీసు లోకి వచ్చి కూర్చున్నది మొదలుకొని మళ్లీ సాయం కాలం దీపాలుపెట్టిం తరువాత లేచివెళ్లేవరకూ, ఏపని కొరకైతేనేం, వీరిదగ్గిరికి వచ్చేవారి వార్తాలాపాల్ని గురించి ప్రత్యేకంగా టూకీగా రాయబూనుకొన్నప్ప టికీ ఒకగ్రంథ మౌతుంది. కాబట్టి నే నిప్పుడు రాయ బొయ్యేదాన్ని బట్టి గ్రహించుకోండి. ఒంటిగంటప్పుడు గది అంతా మనుష్యులతో నిండివుండడం చూచి కొంచెం తెరపయితే వెళ్లుదామనే ఉద్దేశంతో వెలపలికి వచ్చి అక్కడో బెంచివుంటే దానిమీద గూర్చున్నాను. అరగంటైంది; లోపలివాళ్లేమీ తగ్గినలాగు గన్పించలేదు. మనసు పట్టలేక లేచి వెళ్లి చూస్తే యథాప్రకారం గానే ఉంది గది. ఇవతలికి వచ్చి మళ్లీ బెంచీనే ఆశ్ర యించాను......మళ్లీ వెళ్లాను......మళ్లీ వచ్చాను... ఇక ఎన్నిసార్లు వెళ్లివచ్చానో జ్ఞాపకం లేదు. షుమారు నాలుగున్నర అయ్యేసరికి మరీ ఎక్కువకావడం మొద లెట్టింది జనం. ఆ ఒంటిగంటప్పుడే చొరవచేసుకొని ఎందుకు వెళ్లకబొయ్యానా అని చాలా నొచ్చుగున్నాను. కాని అప్పుడు లాభమేమిటి? పోయిన నీటికి కట్ట కట్టడం లాగు. వారిదర్శనం లభిస్తుందో లభింపదో అని విచా రంతో మొగాన్ని తేలేసుకొని మళ్లీ వరాండాలోకే వస్తున్నా.

పంతులుగారి ఆఫీసుకూ వరాండాకూ మధ్య భారతీ ఆఫీసట-ఉంది. ఇదీ చిన్నగదే. లోపల మూడు వేపులా గోడలను ఆనుకొని ఉన్న పుస్తకాల అల్మారీ లే మింగేశాయి గదిలోని ఎక్కువభాగాన్ని. ఆ బీర్వాల మధ్య బల్లలూ, వాటికి వెనకా ముందూ రెండు మూడు కురిచీలూ ఉన్నాయి. వీటిలో ముందున్న కుర్చీమీదికి వెళ్లడం కష్టంలేదు. కాని అవతలికి వెళ్లాలంటే బక్క పల్చటి మనిషే కావాలి. స్థూలశరీరానికి ప్రయాసమే అనుకొంటాను. ఆ ఆఫీసులోని ఎకరు నే నీలా లోపలి కెళ్లడం, మళ్లీ రావడంచూస్తూ, నాముఖవైఖరిని గని పెట్టా రనుకొంటాను, మెల్లగా దగ్గిరికి బిలిచి, "పంతు లుగారికోసం వొచ్చారా?" అన్నారు. అవు నన్నాను. "మరి లోపలికి వెళ్లరేం" అన్నారు. "కొంచెం తెరపయితే వెళ్లుదామని కనిపెట్టుకొని కూచున్నాను. తెరపయ్యే లాగే కన్పించడం లేదు. ఒంటిగంటకూ నే నిక్కడకు వచ్చింది. నాలుగున్నర కావచ్చింది. పూర్వంకంటే ఎక్కువైంది జనం" అన్నాను. అప్పు డాయన కొంచెం నవ్వుతూ, "మీ కిక్కడి కిదే మొదటిపర్యాయం రావడం లాగుంది. మా పంతులుగారి సంగతి ఈలాగే ఉంటుంది అస్తమానమూ. ఆలోపలికి వెళ్లివచ్చేవారినే మీరూ ఆశ్రయించండి. లేకపోతే దర్శనం దొరకదు" అన్నారు. అంతట వెనక్కి మళ్లీ లోపలికెళ్లేవారి వరసలో చిట్ట చివర నిలుచున్నాను, తిరుణాల్లరోజుల్లో రైల్వేవాళ్ల మూడోక్లాసు టిక్కట్ల కిటికీలదగ్గరలాగు. ఏలాగైతేనేం, అయిదుగంటలైనతర్వాత వారిదర్శనం లభించింది. ఎందుకొచ్చానో టూకీగా వినిపించమన్నారు. ఆలాగే చేశాను. స్తిమితమైన మనస్సుతో విన్నారు. "భక్త్యోప పన్నేషు హి తద్విధానాం-ప్రసాదచిహ్నాని పురఃఫలాని" అనులాగున ఊపిరి విడవడానికైనా అవకాశం దొరకని సమయంలో నామాటలను సావధానంగా విన్నవారి మందహాసముఖం-నా యాశాలతను పల్లవింపచేసింది. నా పేరూ, వూరిపేరూ, పుట్టుపూర్వోత్తరాలూ, అన్నీ అడిగి తెలుసుకొన్నారు. ఒకనిముషం ఆలోచించి మర్నాడు రమ్మన్నారు. రేపు ఆదివారం—వ్యాఖుద పౌర్ణమికూడాను. ఆఫీసుకు సెలవు. ఆసంగతి జ్ఞాపకం చేయగా, ఫర్వాలేదు. ఆఫీసు 'లేకుంటే ఇంటిదగ్గరకు రండి' అన్నారు. రేపు తెల్లవారి అక్కడికి వెళ్లుతాను. రేపు మళ్లీ ఉత్తరం రాస్తాను.

చిత్తగించవలెను.

మద్రాసు,
14-6-26.

ఇట్లు విన్నవించువిధేయుడు,
రంగారావు."

ఈలాగు ఉత్తరాన్ని ముగించి అప్పుడే పోస్టుచేసి శయనంమీద చేరాడు. ఇకతర్వాత ప్రపంచవుఖబరే లేదు,

రంగారావు అసలు కాపురం బెజవాడ. అక్కడ పూర్వార్జితమైన ఒక చిన్న పెంకుటిల్లు దప్ప వేరే ఆస్తి లేదు. పన్నెండుఏండ్ల వయసున ఇతడు సెకండుఫారం చదువుతూ ఉండగా ఆకస్మికంగా తండ్రిపోవడం తటస్థించింది. అప్పట్నుంచీ మేనమామ బలవంతంవల్ల తల్లీకొడుకు లిద్దరూ ఆయనదగ్గర ఏలూరు లోనే ఉంటూవచ్చారు ఎక్కువకాలం. ఇతని మేనమామ పేరు నరసింహారావు. తల్లి శాంతమ్మ. మునసబుకోర్టులో నౌకరిచేస్తూ ఏలాగో గుట్టుగా కండుచెరుగులూ మూడే స్తున్నాడు నరసింహారావు. ద్రవ్యబలం లేకపోయినా దయాస్వభావం కలవాడు. అందుచేత బావగారు గతించిన వెంటనే చెల్లెలినీ, మేనల్లుణ్ణీ తీసుకొచ్చి దగ్గర పెట్టుకొని యావత్తు సంసారం తానే జరుపుతూ వచ్చాడు కొంతకాలం. కాని చెల్లెలి కిది న్యాయ మనిపించలేదు- తమ భారంకూడా అతని వొక్కనిమీదనే వేయడం. కాబట్టి దానింత పర్యంతమూ వేరొక ఉద్దేశంతో దాచి ఉంచిన తనవగల నన్నింటినీ, అన్నగారు వద్దంటూ వున్నప్పటికీ వినక, అమ్మించి, అందువల్లవచ్చిన పన్నెండువందల రూపాయలూ, పెనిమిటి గతించిన తోడనే దొరికిన ప్రావిడెంటుఫండు బాపతు రూపాయల్లో ఖర్చుకాగా మిగిలిన మూడువందలూ గలిపి మొత్తం పదిహేను వందలనూ తమ చిరపరిచితుడూ, విశ్వాసీ అయిన ఒకజమీందారువద్ద నుంచి, నెల నెలకూ ఆయన వడ్డీక్రింద ఇచ్చే పదిహేనురూపాయలను అన్న చేతికే యిస్తూవచ్చింది. పతిప్రాణయైన శాంతమ్మ రంగడే ప్రాణధారణకు కారకు డైనాడని యీమెను ఎరిగినవాళ్లందరూ అంటారు. ప్రస్తుతం రంగనిచింత దప్ప వేరొక చింత లేదు ఈసతీతిలకం మనసులో. కొడుకునూ తల్లి కోరికలను వృథాపుచ్చలేదు. కష్టపడి ఇతడు చేసే అభివృద్ధి తల్లియొక్క ఆశాలతాపల్లవాలకు వసంతాగమమైందిగాని శిశిరాగమం కాలేదు. స్కూలుఫైనల్ వరకూ రంగారావు చదివింది ఏలూరు హైస్కూలునందే. ప్రతి సంవత్సరం ఏదో ఒక బహుమానం వస్తూనే వచ్చింది. తరువాత రాజమంద్రి ఆర్ట్సుకాలేజిలో దాఖలయ్యాడు. అక్కడినీళ్లు పడలేదు. ఒకసంవత్సరం తర్వాత శరీరమస్వస్థమైంది. ఈ హేతువుచేతనే F.A. పరీక్షయందు ఆంధ్రజిల్లాల్లో మొదటివాడుగా వచ్చినాడనీ, లేకపోతే ప్రెసిడెన్సీకే మొదటివాడుగా వచ్చేవాడనీ అన్నారు అతన్నెరిగిన ప్రొఫెసర్లందరూ. ఇతని దేహారోగ్యం తప్పినందున అసల్లోనుంచికూడా రూపాయల్ని ఖర్చుపెట్టవలసివచ్చింది. ఈ అన్నికారణాలమూలాన్ని మళ్లీ చదవడానికి ఆరంభించేయెడల ఇంకా ఏ ఇబ్బందులు వచ్చి మీదబడుతాయో అనేభయంచేత ఇంటర్ పరీక్ష కావడంతోటే ఏదైనా చిన్ననౌకరీకి ప్రయత్నించ మని చెప్పింది తల్లి. కాని ఇతనికి మనస్కరించింది కాదు తల్లి సలహా. క్రీ. శ. ఇరువదో శతాబ్దంలో సమస్త భారతవర్షంలో ఎన్ని యూనివర్సిటీ లున్నాయో వాటి అన్నిటిలో ఇవ్వబడే ఉన్నతవిద్య నూటిలో తొంబై తొమ్మిదిపాళ్లు ఆత్మహననానికి మార్గం జూపేవని ఇతనికి బాగా దెలుసు. కాని ఏదో వెర్రిబులబాటం—ఇంకా చదవాల్ననీ. కాబట్టి నీళ్లు పడవని రాజమంద్రి వెళ్లడం మాని, తల్లినీ, మామనూ ఏలాగో సమాధానపరిచి చెన్నపట్నంచేరాడు రంగారావు, తన భాగ్యదేవతను పరీక్షించుకోడానికి.

మేనమామపేర పైన వ్రాసిన ఉత్తరం వలన పట్నంచేరింది మొదలుకొని ఇతడు చేసినదంతా అవగతమైయ్యే ఉండవచ్చు. అదేప్రకారం మర్నాడు సూర్యోదయం గాకపూర్వమే ఆవశ్యక కార్యాలన్నీ దీర్చుకొని ఆరుగంటలకే మైలాపూరు ట్రాంమీద లజ్ చర్చిరోడ్డుచేరి విచారిస్తే కపాలేశ్వరాలయం దగ్గరి రెంటాల హౌసులో పంతులుగా రుంటారని తెలిసి అక్కడికే బయల్దేరాడు రంగారావు. ఇంటిదగ్గర సహితం వారు దర్శకశృంఖలాబద్ధులైయ్యే ఉంటారని వినియున్నందున ఏవేళకు దర్శనం లభిస్తుందో అని యోచిస్తూ మెల్లగా రెంటాల హౌసు చేరేటప్పటికి ద్వారంముందు ఒక చామనచాయ మనిషి నిలుచోని ఉండగా అతనివల్ల పంతులుగారు లోపల ఉండుట తెలిసికొని ఇతనూ వెళ్లాడు లోపలికి. రెండు గుమ్మాలు దాటగానే ఒకచతురశ్రపు అంగణం గన్పించింది. అక్కడ పడమటివేపున ఉన్న వసారాలో ఒక తిరుగుడు కుర్చీమీద కూచోని ఉన్నారు పంతులు

గారు. కుడివేపు చేతికందేదూరాన్ని ఒకచిన్న పుస్తకాల కేసు వుంది. ఎదురుగా ఒక బెంచీ. వేరొకమనిషి వారికి దగ్గరగా నేలమీద స్తంభాన్ని ఆనుకొని కూర్చొని ఏదో లోకాభిరామాయణం సాగిస్తూ ఉన్నాడు. నిన్న ఆఫీసులో వారిస్థితిని జూసిన తరువాత నేడు తనకింతసేపు వారితో మాట్లాడడానికి సమయం దొరుకుతుందని అనుకోలేదు. ఆనాడు ఇతనిఅదృష్టమే అనాలి. సావకాశంగా వార్తాలాపాలు జరిగాయి. అసహాయోద్యమము, స్వరాజ్యపక్షపరిణామము లోనగు తాత్కాలికవిషయాలనుగురించి చాలాసేపు మాట్లాడారు. సంభాషణమైన తర్వాత తాను వచ్చినసంగతి జ్ఞాపకం చేయగా ఆతనికి గావలసిన ఖర్చులను ఇప్పిస్తానని వాగ్దానంచేస్తూ నెలకు ఎంత గావలసినదీ ఉజ్జాయింపునలెక్క వేసికొని తీసుకరమ్మన్నారు. వచ్చిన కార్యం సఫలమైందనే సంతోషంతో వారిదగ్గర సెలవు దీసికొని మళ్లీ బయల్దేరాడు జార్జిటవునుకు. అప్పుడు షుమారు ఎనిమిదింబావు అయివుంటుంది. బీచి గుండా వెళ్లాలని సముద్రంకేశి మళ్లాడు ట్రామును వదలి.

౨

ఆనాడు మాఘశుద్ధపౌర్ణమీ. మబ్బుగాడన్నమాటలేక నిర్మలంగా ఉంది ఆకాశమంతా. రంగారావు మైలాపూరు ట్రాంటెర్మినసు వీధిగుండా కొంతదూరం నడచివచ్చి సేన్‌థోమ్ చర్చికి వెనగ్గాఉన్న రోడ్డుమీదుగా బీచిలో ప్రవేశించేసరికి అప్పటికే సముద్రతీరమంతా జనులతో నిండిపోయింది. సూర్యకిరణకాంతులు సముద్రతరంగాలమీద ఉయ్యాల్లూగుతున్నాయో లేక వాటితో మల్లయుద్ధమే చేస్తున్నాయో తెలియడంలేదు. రంగురంగువస్త్రాలు ధరించి ఆబాలవృద్ధులైన స్త్రీపురుషులు ఇటూ అటూ తిరుగుతూఉంటే సృష్టియొక్క మినిటూరుచిత్ర మనిపించుతూ ఉంది దూరాన్నించి చూసేవాళ్లకి. పర్వం, అందులోనూ మాఘశుద్ధపౌర్ణమీ అని తక్కినపర్వాల్లోకంటే ఆనాడు ఎక్కువగా వచ్చింది జనం. మధ్యయుగంలో, స్వార్థముచేతనైతేనేమి, మరి ఏకారణంవల్లనైతేనేమి, సంఘంలో ప్రవేశించిన దురాచారాలను వదిలిపెట్టినయెడల హిందూమతమంత వైజ్ఞానిక నియమబద్ధమైనమతం ప్రపంచంలో వేరొకటి లేదని పక్షపాతంలేని విద్వాంసు లనేకులు అభిప్రాయ మిచ్చి ఉన్నారు. కాని గర్భదరిద్రుడైన వాని తెలివితేటలు వెలపలికి రావడానికి అవకాశంలేనిలాగు గర్భదాసత్వంలో మునిగిఉన్న హిందువుల మతములోని ఉత్కృష్టత్వాలు గూడా పైకి రాలేకపోవడం అలాఉండగా, ఇతరుల టీకా టిప్పణీలకు సైతం పాలవుతూ ఉన్నాయి. దీనవాడు ఒప్పుచేసినా తప్పే; ధనవంతుడు తప్పుచేసినా ఒప్పే. విదేశీయులమాట చెప్పనేఅక్కర్లేదు; హిందువుల సుగుణాలుకూడ వీరికళ్లకు అవగుణాలుగానే కనబడుతూ ఉంటాయి. కాని దేశీయులునూ కొందరు కానివాటినీ అయినవాటినన్నింటినీ కానివాటికిందే జమ కట్టుతూఉండడం ఆశ్చర్యం. ఈలాఉండగా ప్రస్తుతం నాగరికతా గండపెండేరం వేసుకొనిఉన్న యూరోపు అమెరికా దేశాల్లోని విజ్ఞానవేత్తలు నిరాటంకమైన సూర్యకిరణప్రసారణంలో బాహ్యాసేవనమూ, సముద్రపుస్నానాలూ దేహారోగ్యానికి మంచివని ఘోషించడం మొదలిడిన లగాయతూ ఇక్కడ వాటిని కూడదన్నవారికి సహితం ఒప్పుకోవలసేవచ్చింది. హిందూదేశంలో హిందూశాస్త్రాల్లో రాయబడినవన్నీ మూర్ఖప్రలాపాలే కాబట్టి అన్నీ వర్జనీయాలే. అవ్వే ఏజర్మనీ నుంచో, ఏఅమెరికానుంచో, ఏవిదేశభాషాకవచాలతోనో ఇక్కడికి దిగుమతియైనాయంటే శిరసావహనీయాలూ, వందనీయాలూ, అవశ్యం ఆచరణీయాలూనూ...కానిండు.

మదరాసులోని పేటల్లో సందుగొందుల్లో వెలపలికి రావడానికి అవకాశందొరకక కుళ్లుతూపడివుండే మొగాలన్నీ ఇవ్వాళ విశాలమైన సముద్రతీరంలో శుభ్రమైన సూర్యరశ్మినీ, స్వచ్ఛమైన వాయువునూ సేవిస్తూ మహానందంతో కలకల్లాడుతూ ఉన్నాయి. రంగారావు ఈగుంపుల్లో ప్రవేశించి ఉత్సవాన్ని చూస్తూ టవునుకేసి నడుస్తున్నాడు. మైలాపూరు ట్రిప్లికేను తీరాలు వెనుకడ్డాయి. క్రమంగా తీరాన్ని జనంతగ్గి తుదకు చేపలవాళ్లు మిగిలారు. కెరటాలు వచ్చి తీసిపోతూఉంటే బయటపడే రొయ్యలనూ గొప్పలనూ బట్టుకొనేవాళ్లు కొంతమందీ, తొడలోతునీళ్లలో వలలువేసేవాళ్లు కొంత

మందీనీ. మెల్ల మెల్లగా అక్వేరియం, సెనేటుహౌస్, మారినా, కువ్వంనదీ మొదలైన ప్రదేశాల బీచీలన్నీ కడచి పోయ్యాయి. ఫోర్టుముందరి బీచిలో ప్రవేశించేసరికి హైకోర్టుబీచంతా వెనకచూసిన వాటికంటె ఎక్కువగ స్త్రీపురుషులతో కిటకిటలాడుతూ ఉంది. ఈ జనసముద్రంలో నడుమ నడుమ వేయబడివున్న కొబ్బరాకులపాకలూ ఒకవిశేషసౌందర్యాన్నిస్తూ ఉన్నాయి. ఇక్కడి వేడుకలను గూడా చూసుకొంటూ పోదామనే ఉద్దేశంతో జనసమూహంలో ప్రవేశించి పోతున్నాడు రంగారావు. రండి మనమూ ఇతనితో గలసి కొంతదూరం పోదాం. పెద్దపెద్ద భూచక్రపు గొడుగులనీడని ఊరేగిస్తూ బాజాభజంత్రీలతో, తాళమేళాలతో తీసుకొని వచ్చిన ఉత్సవవిగ్రహాల్ని సముద్రజలాని కెదురుగా ఏలా నిలవబెట్టారో చూశారూ. తడిసిన చీరలవెంటా, ధోవతులవెంటా నీళ్లధారలు కారుతూఉంటే పరుగెత్తుకొని వస్తున్నారు అరుగో, స్త్రీపురుషులు తండోపతండాలుగా, ఈ దేవుళ్లకి మొక్కడానికి. భక్తి ఉద్రేకంవల్ల ఇప్పుడు వీళ్లందరూ శిశుప్రాయులైపోయ్యారుసుమండీ. లేకపోతే చాకింటిమడత కొంచెం నలిగిందాంటే మాసిపోయిందని అవతల పారేసే ఈయువతీయువకులు సహితం పిల్లల్లాగు ఈలా ఇసకలో బడి పొర్లాడుతారా? చూడండీ! ఏలా సాష్టాంగాలు పడ్డారో. ఆహా! ఏం రకరకాల పూలదండలూ ఇటునేపూ! వాటిపక్కనే ఒకఅమ్మి కూచొని నవనాన్ని కట్టలు గట్టుతూవుంది. ఈ పురోహితులు తడికొల్లాయిగుడ్డలను కింద పరచి వాటిమీద విస్తరంటులూ, వాటిలో కుశతిలాక్షతాది ద్రవ్యాలూ సేకరించుకొని మహాడాబుగా జపిస్తూ కూర్చున్నారు గాని మొగాలమీద సంతోషరేఖలేమీ అగపడడంలేదు. పాపిష్టి కలికాలం. కాండబ్బిచ్చిపితాళ్లకు నీళ్లు విడిచే పాపాన్ని పోవడంలేదు ఎవరూనూ. అబ్రాహ్మలు నారికేళ్లైనా మాడరు. బ్రాహ్మణులకు భక్తే లేదు. ఇక చింత కాకపోతే సంతోషం ఎక్కణ్ణుంచి వస్తుందీ.

ఆహా! ఆనందమంటే ఈ బాలకులదే. నడుములబంటి నీట్టిలో నిలుచొని తరంగం వచ్చినపుడల్లా పైకెగురుతూ బుడుగుబుడుగుమని వరసబెట్టి మునకలేస్తున్నారు. ఆ గృహస్థు ఎవరోగాని తనవాళ్లు నీళ్లలో దిగడానికి భయపడుతూవుంటే బలవంతాన్నిలాక్కెళ్లి ఏలా స్నానం చేయిస్తున్నాడో. ఒడ్డునే నతికిలబడి కెరటం తమదగ్గరకు వచ్చినపుడల్లా చెంబులను ముంచుకొని అందులోకి వచ్చిన ఇన్నినీళ్లనూ ఇసకనే నెత్తిని కొట్టుకొంటున్నారు ఈ ఇద్దరు జవ్వనులూ; వీరిది అందరికంటె నిర్భయమైన స్నానం. వహావా! ఏమి ఈవైష్ణవవిలాసినీ భక్తి. స్నానం చేసి జారుముడి వేసుకొని నొసటి తిరుమణి అడ్డరేఖమీద తిరుచూర్ణపు నిలువురేఖ మొగాని కొక కొత్త అందం ఇస్తూవుంటే చేతులెత్తి సూర్యనమస్కారాలు చేస్తూ ఉంది. పాదాలకు జానెడుదూరంలో భూమిమీద నేతితో బెట్టిన జోతి వెలుగుతోంది. అహ్హా! ఘుమ్మనికొట్టడం మొదలెట్టింది దవన మరువాల కమ్మనివాసన. ఎక్కణ్ణుంచి చెప్మా! ఆఁ! మల్లెపూల వాసన కూడానా? సరే! తెలిసింది. ఈలా చూడండి! స్నానం చెయ్యడానికని వెడలించిన ఈకల్యాణుల సుదీర్ఘములైన కేశభారాల్లో చిందులు తొక్కుతూ తప్పటడుగులతో మనకేసి వస్తున్నాడు ఈ సమీరబాలకుడు. అంచేత ప్రవహిస్తూ ఉంది మల్లికా పరిమళమిళితమైన దవన మరువాల సౌరభవాహినీ.-పవిత్రమయ్యాం ఈ వాహినీ స్నానంలో. అదిగో ఆమూరాన్ని చూశారూ! జలగల్లాగు బట్టుకొని ఏలా వేధించుకొని తింటున్నారో ఆబిచ్చగాళ్లూ, స్నానంజేసి ఇళ్లకు వెళ్లేవాళ్లనీ?

తన సామీప్యంలో ఇంతమంది జనులు ఇన్నివిధాల అల్లకల్లోలాలు పడుతూఉన్నా వేటినీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా విరామం లేకుండా తన కల్లోలాలూ తాను వేస్తునేఉంది సముద్రం. ఘోరుకొల్పే భీకరధ్వానాలతో నురుగులు కడుతూ కరుళ్లు వస్తూనే ఉన్నాయి, పోతూనే ఉన్నాయి. సక్రమంటూ ఒక్కొక్కతరంగం గట్టుమీదికిగూడా వ్యాపించి అక్కడ పెట్టివున్న ఏగుడ్డలమూటనో, ఏబూట్లజోడునో నీటితో ముంచి తీసిపోతూ ఉంటే దిగాలబడి చూస్తున్నాడు దూరాన్ని స్నానంచేస్తూ ఉన్నవాటియజమాని. ఒక్కొక్క బలమైన కెరటం తగిలి బోర్లపడేవాళ్లు పడు

తున్నారు; లేచేవాళ్లు లేస్తున్నారు. అవిమాత్రం వీటిని లక్ష్యం చేయడంలేదు. పడ్డవాళ్లు లేచేవరకూ ఆగడమూ లేదు. నిలిచి నిలిచి విశేషాలన్నీ చూసుకొంటూ నడుస్తున్నాడు రంగారావు. అకస్మాత్తుగా సముద్రనిర్ఘోషాన్ని మించిన ప్రచండరావంతో ఒక్కపెట్టున గొల్లుమంది ప్రజఅంతా, ఇతని వెనక వేపున. చప్పున తలదిప్పి చూశాడితను. తా నున్నచోటికి పదిగజాల వెనక వందలకొలది జనులు తీరాన్ని పోగై ఆకాశం ఎగిరిపొయ్యేలాగు కేక వేస్తున్నారు, "పిల్లకొట్టుక పోయింది" "పిల్లకొట్టుకపోయిం"దని. సుమారు నలభైఏండ్ల గౌరాంగుడైన గుజరాతీపురుషు డొకడూ తడిసిన ధోవతీతో అడ్డంవచ్చిన వారినందరినీ తోసుకుంటూ సముద్రంలోకి ఉరకపోతున్నాడు, చేతులు చాచుకొని, "హాయ్! బేటీ! హాయ్‌లీలే! హాయ్! మేరీ బేటికో బచావ్"అని రోదనంచేస్తూ మొగం మోదుకొంటూనూ. అతని స్త్రీ కాబోలు ఆలాగే మహాకరుణంగా విలపిస్తూ పురుషునికంటె ముందు సముద్రంలోకి ఉరకాలని చూస్తూంది. మరికొందరు స్త్రీలు వీరివెంట ఉన్నారు ఆక్రందిస్తూ. కాని వీళ్లనందరినీ సముద్రంలోకి బోనివ్వకుండా వెనక్కు లాగుతున్నారు అనేకమంది. అందరిచూపులూ నీళ్లలోపలికి వున్నాయి. ఇంతలో అక్కడికి నలభై యాభై గజాలదూరం సముద్రంలో తెల్లని చీరలాగు నీళ్లమీదికి తేలి ఏదో చప్పున మునిగిపోయింది. క్షణమాత్రంలో అవగతమైంది సంగతంతా రంగారావుకు. దైవప్రేరితంలాగు ఉత్తరీయాన్ని నేల మీద విసరికొట్టాడు.

చొక్కా చినిగేదికూడా తెలియకుండా లాగిపారేసి ధోవతిని పైకెగగట్టుకొని గుభాలుమని దూకాడు సముద్రంలో. అతని కప్పు డేదో ఆవేశం పెరిగినలాగై ఎక్కడలేని బలమూ వచ్చింది. తరంగాలు మహాతీవ్రంగా అడ్డగిస్తూ ఉన్నాయి. వాటి కెదురుపడ్డా డితను. పెద్ద పెద్దతరంగం వచ్చినపుడల్లా మునిగి ముందుకే నెట్టుకొని పొయ్యాడు శక్తినంతా వినియోగించి. చూస్తూ చూస్తూ ఉండగానే వస్త్రంగాన్పించిన ప్రాంతంలో దేలి తల యెత్తి ఇటూఅటూ చూశాడు. ఒడ్డుమీద నిలుచున్న వాళ్ల సర్వేంద్రియ వ్యాపారాలూ నేత్రేంద్రియ వ్యాపారంలోనే కేంద్రీభవించాయి. నిశ్శబ్దమై పోయింది తీరమంతా. బొమ్మలాగు ఊపిరినిగూడా తిప్పుకోకుండా చూస్తున్నారు వీళ్లందరూ. రంగారావు నీళ్లమీద తేలి ఇటూఅటూ చూడగా అతనిముందు అయిదుగజాలదూరంలో మళ్లీ కన్పించింది ఆదేవస్త్రం- రవంత నీటిమీదా, తక్కిన భాగమంతా నీళ్లలో. వెంటనే దానిమీది కెగిరి దూకాడితను. తాననుకొన్నలాగే అయింది. చేతికి వెంట్రుకలూ, బాలికాశరీరం దొరికాయి. చప్పున నీళ్లమీదికెత్తాడావిగ్రహాన్ని. దొరికిందిదొరికిందనేధ్వనితో మారుమోగిపోయింది.తీరమంతా ఎత్తినదాన్ని ఎత్తినలాగే కుడిచేత్తో పట్టుకొన్నాడు. దేహస్మృతి లేనందున నిర్జీవమైన ప్రతిమలాగు అస్తవ్యస్తంగా పడిఉంది ఆశరీరం అతనిదక్షిణహస్తంమీద. అలల ఆర్భాటంవలన ఒకటిరెండుమార్లు తన నెత్తిమీదుగ నీళ్లు ప్రవహించినప్పటికీ బాలికను మాత్రం మునుగ నివ్వలేదు. వెనక కొట్టే అలలతో ముందుకు వచ్చి పడుతూ, మళ్లీ సముద్రంలోకి లాక్కెళ్లేవాటిని మహాప్రయాసం మీద తప్పించుకొంటూ పదిగజాల దూరంలోకి వచ్చేసరికి ఒడ్డుమీదివారంతా ఎగబడి స్త్రీలూ బాలికనూ, పురుషులు రంగ నీగట్టుమీదికి చేర్చారు. బాలికకు స్మృతే లేదు. కలిగిన ఆయాసంవల్ల రంగారావుకూడా తీరానికి రావడంతోటే వెల్లకిల బడిపొయ్యాడు. భయంచేతా, ఆయాసంచేతా స్మృతి తప్పిపోయిందిగాని యీ బాలిక జీవించి ఉన్నదనే స్పష్టమైంది. అప్పుడక్కడ ఉండడం తటస్థించిన డాక్టరొకరు ఆమె శరీరంలోని నీళ్లను కొంచెం వెలికి గక్కించి తత్‌క్షణం ఇల్లుచేర్చమన్నారు చికిత్స చేయడానికి. బర్మా షెల్ ఆయిల్ టాంకుల దొడ్డిదగ్గర వీరిమోటరు సిద్ధంగానే ఉంది. దానిని ఆక్షణమందే తెప్పించి కూతును, రంగారావునూ ఎక్కించుకొని వేగాలమీద ఎగిరిపొయ్యాడు, కృష్ణచందు- ఇదే ఆ గుజరాతీ గృహస్థుని పేరు.

3

జార్జిటవున్నుంచి పరశువాకం పోతూ మింటుస్ట్రీట్టు రాగానే దానిలో కుడిచేతిప్రక్కకు దిరిగి కొంచెము దూరంమాత్రమే గడచిపోయామంటే అక్కడకళ్లకు

పండగజేసే నాలుగు అంతస్థుల రంగురంగుల హవేలీ శ్రీమంతులైన సేఠ్ కృష్ణచందుగారిది. కోట్లకుమించిన వ్యాపారం చేస్తూఉండడంవల్ల వీరి నందరూ సేఠని పిలుస్తూ ఉంటారు కాని బ్రాహ్మణులలోత్పన్నుడీయన. ఔదీచ్య శాఖ. వీరిపూర్వులు అహమదాబాదులో రత్నవ్యాపారులుగా ఉండి లక్షలాది ద్రవ్య మార్జించారు. గుజరాతీలు, సింధీలూ, మార్వాడీలూ ఉద్యోగశూరులూ, పరదేశాటనపరులూనూ. ఆంధ్రుల్లాగు సముద్రం దాటితే కులం బోతుందని జడిసి ఉన్నచోటే పడివుండేవారు గారు. స్వదేశాన్ని వదలి వేలకొలది మైళ్లదూరంలో ఉన్న విదేశాల్లో ప్రవేశించి వర్తకవ్యాపారాలు చేయడంలో వీరిది పెట్టిందిపేరు. ప్రస్తుతం వందలకొలది మార్వాడీ కుటుంబాలచే నిండిపోయిన మనఆంధ్రదేశమే ఇందుల కొక తార్కాణము. ఈలాటి ఉత్సాహసంపన్నుల్లో ఒకడైన శ్రీచందు-కృష్ణచందుని పితామహుడు, అహమదాబాదులోని వ్యాపారంతో తృప్తినొందక బరోడా బొంబాయి నగరాల్లోకూడా గొప్పగొప్ప వర్తకస్థానాలను ఏర్పరచి, ఆరెండుచోట్ల వ్యాపారం బాగుగ స్థిరమైన తర్వాత ఆ సమయానికి ఉచితవయస్సులోనికి వచ్చిన కొడుకును గోపాలచందును నిజాం హైదరాబాదులో వేరొక వ్యాపారాలయం స్థాపించడానికి పంపాడు. కొన్ని పరిమిత సంవత్సరాల్లోనే గోపాలచందువ్యాపారం అశ్వధాటీతో పరుగెత్తింది. హైదరాబాదు రెసిడెన్సీ, సికింద్రాబాదు జేమ్సుస్ట్రీటుల్లోని కొన్ని సుందరభవనాలు మాత్రమే గాక ఊరిబయటి దివ్యసౌధాలూ కొన్ని వీరి స్వాధీనమైనాయి. నిజాంఇలాకాలోని ధనవంతులకూ, సంస్థానాధిపతులకూ మాత్రమేగాక నిజాంగారి దర్బారుకూ, వారిజనానాలకూ, గావలసిన రత్నఖచితములైన జవాహిరీలు, సువర్ణమణిమౌక్తికాలూ వీరినుంచే సప్లయి అవుతూవచ్చాయి. ఇంత ఎందుకూ? అవసరం వచ్చినయెడల నిజాందర్బారువారికి కోట్లకొలది ద్రవ్యం ఇవ్వడానికి సిద్ధంగా ఉండేవాడు గోపాలచందు. ఈలాగు భాగ్యపురంలో కలిసివచ్చేసరికి ఈయన కుమారుడు కృష్ణచందునకుగూడ యుక్తవయసురా ఆయన ఇతన్ని మద్రాసుకు పంపాడు.

అదృష్టవంతుడు పట్టిందల్లాబంగారమే అవుతుంది. పట్నంలో చందులవ్యాపారం వాయువేగ మనోవేగాలతో పెరిగింది. కేవలం అయిదారేండ్లకాలములోనే మింటుస్ట్రీటులో ఒకవిశాలమైన పూర్వపు ఇంటిని కొని దానిని బడగొట్టించి కొత్తపునాదులతో ఈనాలు గంతస్థులసౌధాన్ని కట్టించి తాతగారియెడలగల భక్తిగౌరవాలను ప్రకటించుకొనునిమిత్తం దానికి శ్రీవిలాసం అనేపేరు పెట్టాడు కృష్ణచందు. ఇప్పుడింకో మూడంతస్థుల దివ్యభవనం కీల్పాకులోని ఒకసుందరోద్యానం మధ్య ఉంది దానిపేరు గోపాలవిలాసం-తండ్రిపేరున. ఈ సౌభాగ్యసీమంతినీ ప్రియకుమారుని తండ్రి తాతలిద్దరూ ప్రస్తుతం దృఢకాయులై తమతమ కార్యముల నిర్వహించుకొన సమర్థులై ఉన్నారు. అహమదాబాదు, బరోడా బొంబాయి, హైదరాబాదు, మద్రాసునగరాల్లో వీరి వజ్రాలవ్యాపారం నిరాఘాటంగా జరిగిపోతూ ఉంది. తండ్రి హైదరాబాదులో, తాత అహమదాబాదులో నివాసంగా ఉండి వారివారికి సమీపంలో ఉండే కార్యస్థానాలనూ నిరీక్షిస్తూఉంటారు. కృష్ణచందుకు ముగ్గురు కొడుకులూ, ఒక కూతూరూ. అందరిలో పెద్దవాడు లక్ష్మీచందు. పదిహేడు సంవత్సరాలుంటాయి. స్కూలుఫైనల్ పరీక్షయిచ్చి ప్రస్తుతం తాతగారిదగ్గరికి వెళ్లి ఉన్నాడు హైదరాబాదులో. రెండోసంతానం కూతురు. పేరు లీలావతి. పదిహేనేండ్లు ఉండవచ్చును. మూడోవాడు భువనచందు తొమ్మిదిపదేండ్లకుర్రవాడు. అందరికంటె చిన్నవాడు నాలుగేండ్ల పూర్ణచందు. ఈనలుగురూ నాలుగు పోతపోసిన పసిడిబొమ్మలే. అల్పజ్ఞానులయిన మనుషులు పోసేపోతల్లో లోపమేదైనా వస్తే రావచ్చునుగాని సర్వశక్తివంతుడూ, చిత్స్వరూపుడూనైన భగవంతుడు పోసేపోతల్లో లోప మెక్కడనుంచైనా వస్తుందా? వారిలో లీల లీలామానుష విగ్రహమే. మెరుపుతీగలాగే ఆకర్షిస్తుంది ఆబాలిక శరీరకాంతి లోకుల చూపులనీ. తేరిపార చూచినయెడల అట్టివారికి మెరుపుజూపినవాళ్ళకుపట్టేగతే పట్టేది. అతిప్రకాశమానములయిన పదార్థములను చూచినయెడల కొంతసేపటివరకూ ఏవేపు దృష్టి సారించినప్పటికీ ఆచూచినపదార్థము

వంటి శోభలే కనబడుతూ ఉంటాయి. అదేపనిగా లీల నించుక చూసినవాళ్ళకు ఎటువేపు తిలకించినా లీల లీలలే అగపడేవి. ఇక భౌతిక తేజఃపుంజము దీర్ఘావలోకనంచేత ఒక్క నేత్రేంద్రియాన్నే నాశనంచేస్తుంది. కాని లీలా లావణ్యపుంజము సకలేంద్రియాలనూ నాశనముచేస్తుంది. ఏలాగా? లీలను చూస్తే మానసేంద్రియం నష్టమైనట్లే. అది పోయిన తర్వాత పంచేంద్రియాలు ఉండేం? లేకేం? కృష్ణచందు కావడానికి బ్రాహ్మణుడే. కాని అసలైన ఆర్యసమాజీ. ఈయనతండ్రి గోపాలచందు దక్షిణ హైదరాబాదులోని ఆర్యసమాజానికి పోషకుడుగా ఉండి తరుచుగా రెసిడెన్సీలోని సమాజానికి ప్రతి ఆదివారం వెళ్లుతూ అక్కడ సంఘసంస్కరణం నిమిత్తం లెక్చర్లు ఇస్తూవుంటే కొడుకుగూడా వెంటనే వుండి వింటూ ఉండేవాడు. కురాను గ్రంథంమీదా, అరబ్బీ భాషమీదా ప్రాణాలువదలడానికి ముసల్మానులేలాగు తయ్యారుగా ఉంటారో అదేలాగు ఆర్యసమాజకులు వేదంమీదా, సంస్కృతం మీదా కుర్బానీ* కావడానికి సిద్ధంగా ఉంటారు. అందుచేత భాగూలాలనే ఒక మంచి విద్వాంసుని ఏర్పాటుచేసి సంస్కృతంనూరిపోయించినాడు కృష్ణచందు లీలను. ఇదిగాక హిందీ గుజరాతీ, ఇంగ్లీషూ, తెలుగూ భాషలుకూడా తెలుసు నీమెకు. సంగీతమందు మంచి ప్రావీణ్యం ఉంది. ఈలాటి సకలకలానిధిని కలానిధితో పోల్చవచ్చునంటారుగాని, నాకేమో మనసొప్పదు సజీవమైన కుందనపు బొమ్మను జడంతో పోల్చడానికి.

ఆర్యసమాజానికి చెందినప్పటికీ సనాతనౌదార్యముంది కృష్ణచందు దగ్గిర. వచ్చి పోయ్యే బంధుమిత్రాదుల కారణాన్ని (ఎల్లప్పుడూ) నిత్యకళ్యాణం పచ్చతోరణం లాగుంటుంది వీరి శ్రీవిలాసం. ఈలాటి లక్ష్మీ సంపన్నుని ఇంట ఇప్పుడు మనుగడుపు విందుగా దిగిఉన్నాడు మన రంగారావు. ఆనాడు సముద్రతీరాన్ని వందలకొలది మనుషులు కళ్లను మిటకరింపుగుంటూ ఒక్కడైనా లోపలి కురకడానికి సాహసించకుండా వున్న సమయంలో తనప్రాణానికి తెగించి నీళ్లలోబడి తనకూతును రక్షించినాడని ఒక్క కృష్ణచంద్రునికే కాదు, ఇంటిల్లిపాదికే కాదు, ఆ వీధిలో లీలను ఎరిగి ఉన్నవారికందరికీ ఇతనిమీద అవ్యాజానురాగం జనించింది. సంబంధబాంధవ్యాలు జన్మాంతరసంచితాలని మనపెద్దల అభిప్రాయం. ఇందులో సందేహమేమీ అగపడదు. ఎక్కడో బెజవాడలో పుట్టిపెరిగి, ఏలూరులో కొంత కాలం, రాజమండ్రిలో కొంతకాలం చదువుకొంటూవుంటే నీళ్లు పడవనే నెపం కల్పించి మద్రాసునగరాని కీడ్చుకొని వచ్చి ఈ మహాపట్నంలో జీవనోపాయం, వసతీ ఏలాగు దొరకునోయని విచారిస్తూ ఉన్న ఆంధ్రకుమారుని వేల కొలది మైళ్ళదూరమందలి అహమదాబాదునుంచి వ్యాపారనిమిత్తం వచ్చి ఉండగా కుమారీరక్షణ మనువ్యాజంతో గుజరాతీల ఇంట జేర్చింది అఘటనాఘటన సామర్థ్యంగల విధివిలసితం. సముద్రఘటనం తర్వాత కృష్ణచందుకూతునూ, రంగారావునూ తనఇంట జేర్చి డాక్టర్లను బెట్టి వారికి చికిత్స చేయించడమూ, క్రమంగా ఇద్దరికీ పూర్ణారోగ్యం కావడంగురించి పెంచి రాయవలసిన అవసరం లేదు. అక్కడ చేరిన మర్నాడే రంగారావుకు బాగా నెమ్మది కలిగింది. తనబసకు వెళ్లుతానన్నాడు. కాని ఇతని పోనియ్యక, పోవడం అలా ఉండగా నౌకరు సమేతంగానతనిటాక్సీమీద పంపి బసలోనిసామానునంతా తనయింటికే తెప్పించుకొన్నాడు కృష్ణచందు. అప్పటికి మాత్రం రెండుమూడు రోజులపాటుండి బాగా శరీరాయాసం దీరిం తర్వాత పోవచ్చునంటే సరే అని ఒప్పుకున్నాడు రంగారావు అక్కడ ఉన్న ఆ రెండుమూడు రోజుల్లో ఒకనాడు వీరిద్దరికీ చాలాసేపు సంభాషణ జరిగినది. ఇతని పుట్టు పూర్వోత్తరాలూ, ఇంతవరకూ ఎక్కడ ఉన్నదీ, ఏంచేస్తూఉందీ, ఇక్కడికెందునిమిత్తం వచ్చిందీ, ఈఅన్ని సంగతులనూ అడిగితే ఉన్నదాన్ని ఉన్నాలాగు చెప్పాడు రంగారావు.

కృష్ణచందు వీటినన్నింటినీ విని తన సూవత్తు సంగతినీ సంగ్రహంగా వినిపించి, వేరొక్కచోటికి వెళ్లి కష్టపడవలసిన అవసరమేమీ లేకుండా తనదగ్గరే వుండమనీ, చదువు లోనగు వాటికి గావలసినంత ధనం తానే ఇస్తాననీ చెప్పాడు. మొదలు రంగారావుకు సంకోచం కలి

* కుర్బానీ=బలి.

గా ఉండవలసిని. కాని కృష్ణచందుని బలవంతం తక్కువ కావడంలేదు. శ్రీనాగేశ్వర రావుగారి వాగ్దానంగూర్చి వినిపింపగా దాను స్వయంగా వెళ్లి పంతులుగారిని ప్రార్థిస్తానని ధైర్యం జెప్పి, ఏలాగైతేనేం చివరకు ఒప్పుకునేలాగున చేశాడు రంగారావుని కృష్ణచందు. అది మొదలూ అతని నివాసం శ్రీవిలాసంలోనే. ఒక పర్యాయం పంతులుగారిని దర్శించి జరిగిన సమాచారమంతా వారితో జెప్పగా స్వజాతీయుమైన ఆంధ్రసుపుత్రుడొనరించిన సాహసకార్యం మెచ్చికొని దీవనలిచ్చి పంపారు దేశోద్ధారకులు.

౪

రంగారావు కృష్ణచందుగారి శ్రీవిలాసంలో ప్రవేశించి రెండు సంవత్సరాలైంది. ఈ మధ్యకాలంలో ఇతని సద్వర్తనం, ఇతని నిరభిమానమైన జీవనం, ఇతని తెలివితేటలూ ఇంట్లోవాళ్లందర్నీ మోహముగ్ధుల జేసివేశాయి. భువనపూర్ణలింకా పసివాళ్లే కాబట్టి వాళ్లను గురించి ఎక్కువ రాయవలసిందేమీ లేదు. కాని లక్ష్మీచందుకూ ఇతనికీ కలిగిన స్నేహంమాత్రం వర్ణనీయమైంది. ఒకరిని వదలి ఒకరు ఉండలేక పోతూ వచ్చారు. ఇక్కడికి వచ్చింది మొదలుకొని రంగారావుపేరు రావుకింద మారింది. మనంకూడా అప్పుడప్పుడీ పేరునేవాడుకొందాం. ఇతరులతో చెప్పని తన మనసులోని రహస్యాలను రావుజీకి మాత్రం జెప్పి అతని సలహాను దీసిగుంటూ ఉండేవాడు లక్ష్మి. స్కూల్ ఫైనల్ పాసైంది మొదలుకొని ఇతనికి విదేశాల్లో, ముఖ్యంగా యూరపు అమెరికాల్లో, భ్రమణచేయాలనే బుద్ధి పుట్టింది. ఈ సమాచారం కొన్నాళ్లవరకూ రావుజీకి దప్ప మరెవరికి దెలియదు. అతడితని అభిలాషకు ఆటంకం చెప్పక పోవడం కాకుండా మీదుమిక్కిలి ప్రోత్సాహం చేశాడు. తలిదండ్రుల కెందుచేతనో ఈ విదేశభ్రమణ మంత రుచించలేదు. మరింత పట్టుబడితే తండ్రి ఒప్పుకొనేవాడేమో కాని, అప్పుడు ఇతను కూడా ఆ వుద్దేశాన్ని మాని ఇంటర్ మీడియేటు తరగతిలో జేరి యథాపూర్వం చదవడం మొదలెడితే తలిదండ్రులు లావ్యాసంగం పోయిందనుకొన్నారు. ఇప్పుడు రావుజీకి బి. ఏ. పరీక్ష, లక్ష్మికి ఇంటరు పరీక్ష లయిపోయ్యాయి. పరిణామాలు ఇంకా రాలేదు. పరీక్ష కావడంతోటే లక్ష్మికి హైదరాబాదుపోవడం వాడుక. కాని రావుజీ వచ్చింది మొదలుకొని అక్కడికి వెళ్లడం మానాడు. చెన్నపట్నంలోనే వీరికాలం సుఖంగా వెళ్లిపోతూ వచ్చింది. ఈ మధ్యకాలంలో పద్మాలోచను ఇంటిలోని ఆడంగుల బలవంతాన్ని రావుజీ ఉత్తరం వ్రాస్తే అతనితల్లి వచ్చి కొన్నాళ్లుండి వెళ్లిపోయింది ఏలూరు. ఆమె ఇక్కడ ఉన్నన్నిరోజులూ కృష్ణనందూ, ఇంటివాళ్లూ ఆమెయెడల జూపించిన ప్రేమపూర్ణమైన గౌరవాదరాలను తిలకించి ఇంటిలోని దాసదాసీలందరూ ఆమెను కృష్ణనందుని చెల్లెలుగా భావించారు గాని పరాయిమనిషి అనుకోలేదు. ఇవన్నీ ఇలాఉండగా, రావుజీమీద గలిగిన అవ్యాజప్రేమమువలన సమయం దొరికినప్పుడల్లా తనదగ్గిర కూర్చుండబెట్టుకొని వ్యాపారసంబంధమైన రహస్యాలూ, తికమకలూ తెలియజేస్తూ చాలవరకు అందులోగూడా కుశలుణ్ని చేశాడు కృష్ణచందు.

తా నిదివరకు సంకల్పించుకొని ఉన్న ప్రకారం దైవచింతనము మొదలగు ధర్మకార్యాల్లో ఎక్కువ సమయాన్ని వినియోగించుకొనుటకు ఇప్పుడు మంచితరుణం లభించిందని ఒకనాడితడు రావుజీని పిలిచి, “ఇంతవరకూ మీరు పరీక్షా ప్రయత్నాల్లో మునిగి ఉండడంవల్ల అందుకేమీ విఘ్నం రానియ్యకూడదని మీకు కష్టమిచ్చానుకాను. ఇక ఇప్పుడు సావకాశం దొరికింది. ఇదిగో నేనున్న సమయంలో, ముఖ్యంగా లేనిసమయంలో, మన వ్యవహారములన్నీ మీరే చూస్తూఉండండి. అంతగా దెలియనివిషయ మేదైనా తటస్థిస్తే నేను ఉండనేఉన్నాను” అని తాళంచేతు లతనికి ఒప్పగించి, ఎప్పుడైనా అవసరం వస్తే రావచ్చునని వానికి మారుతాళంచేతు లన్నింటిని తనదగ్గరే ఉంచుకొన్నాడు. ఆహా! కృతజ్ఞత అంటే ఇలాఉండాలి. ఇక లీలసంగతి ఏమిటా? సముద్రఘటనమైన మూడోనాడు ఈమెకు బాగా తేలిక కలిగింది. బలహీనతమాత్రం తగ్గలేదు. అస్వస్థంగా ఉన్నన్నిరోజులూ ఈమె స్నేహితురాండ్రందరూ వీరింట్లోనే ఉంటూవచ్చారు. వీళ్లందరూ ఎల్లప్పుడూ ఆమెకొనే మాటలగింది, మునుపు మొగమూ ఎరగని వాళ్ల ఇంట్లో ఏలా

వెళ్లతా నాదినమున సముద్రస్నానం చేయడానికి పోయింది మొదలుకొని అంతపర్యంతం జరిగినసంగతులన్నీ బాగా విశదమయ్యాయి. ప్రేమోద్రేకంచేత వెలువడిన అశ్రుజలములతో అభిషేకంచేసి మనఃకమల పుష్పాన్ని అర్పణంజేసి తన్ను రక్షించిన అవ్యక్తమూర్తికి ప్రణామంజేసింది కాని శాంతం కలిగింది కాదు. అభీష్టదేవతా సాక్షాత్కారంలేక భక్తికి శాంతం గూడానా? తన్ను గాపాడిన దివ్యమూర్తిని చూడాలనే ఉత్కంఠ జనించింది. ఆకుతూహలాన్ని అణచుకోవాలని ప్రయత్నంచేస్తుంది. కాని అది ఈమె చేతిలో ఉందా? ఎంత తగ్గించుకోవాలని ప్రయత్నంచేస్తుందో అంతఎక్కువ అవుతూ వచ్చింది ఆ ఉత్కంఠ. స్నేహితురాండ్రను అడగడానికి మనసొప్పలేదు. అడిగితేమటుకు వారేం చేస్తారూ? కొంతసేపటికి తలిదండ్రులు చూడడానికి వస్తే మనసు ఆపుకోజాలక, "నాన్నా! నన్నెవరో సముద్రములోనుంచి లాక్కొచ్చి బ్రతికించారటా. ఒక్కమాటు వారిన్నా దగ్గిరికి పిలుచుకొనిరావూ? చూస్తాను" అని అడిగింది. చింతగాని ఉద్వేగంగాని కలిగించేపనులనూ ఆమెముందు చేయవద్దని డాక్టరు చెప్పాడు. అందుచేత "వారు మనయింట్లోనే వున్నారు నీఒళ్లు కొంచెం నయమైనతర్వాత పిలుచుకొనివస్తా"నంటే కాదు కూడదని మరింతగా అడిగినందువలన రావుజీని తీసుకొని రావడానికి అతనిగదికి వెళ్లాడు తండ్రి.

ఇంతలో వద్దంటూ ఉన్నప్పటికీ వినక లేచి తల్లిని ఆనుకొని కూర్చుంది పక్కమీదనే లీల. కృష్ణచందు రావుజీ లిద్దరూ గడప దాటి లోపల ప్రవేశించగానే చేతులించుక ఎత్తి ప్రణామం చేసింది. ఉద్రేకపూరితమైన ప్రేమభావమూ, కృతజ్ఞతా మిళితమైన సంతోషభావములు రసంత ఎఱ్ఱబారిన ఆమెముఖంమీద తాండవమాడుతున్నాయి. ఆ కరుణారసమూర్తిని చూసేసరికి కరిగి నీరై పోయింది రావుజీ హృదయం. కరిగే మాయమైందో లేక అంతరిక్షానికే ఎగిరిపోయిందో! వెంటనే వెతుక్కొన్నప్పటికీ అతని కఠినహృదయం దొరకలేదు. దయాభావం మొగంమీద తొలుకాడుతూ వుంటే ఆమెను చూస్తూ కొంచెంసేపు కూర్చున్నాడతను ప్రక్కనేఉన్న ఒకకుర్చీమీద. ప్రణామానంతరం ఒక్క క్షణకాలం అతనివదనాన్ని తేరిపార జూచి నిమీలితనేత్రయై మెగల దిండుమీద తలచేర్చి పడుకొంది. లీల నిద్రించు చంటిబిడ్డల వదనాలమీద లాగు అప్పు డాబాలికముఖమున నానావిధభావాలు పుట్టుతూ ఉన్నాయి, పోతూ ఉన్నాయి. ధ్యానిస్తూలాగుంది. ఎవరినీ? కొన్నినిమిషములు ఈప్రకార మున్నతర్వాత, "అమ్మా! నీవు ఇంకా బలహీనంగా ఉంది. నీవు బాగా వొళ్లు కుదిరేవరకూ వీరిని మనఇంట్లోనే వుండమని వేడుకొంటానులే" అని కూతురుతో చెప్పి రావుజీని వెంటగొనిపోయి అతనిగదిలో వదలి తనపనిమీద తాను వెళ్లాడు కృష్ణచందు. ఈసందర్భమున జనించిన ఈప్రేమి ప్రేమికల పరస్పరానురాగం పరస్పరగుణగ్రహణోహదంవల్ల దినాభివృద్ధిని పొంది తుదకు పరిపక్వమై అన్యోన్యవిరహం సహించనిది గూడ యైపోయింది. అంతపర్యంతం ముక్కు మొగ మెరుగని వాళ్లయినాసరే, ఈ పరస్పరాశ్రితమైన ప్రేమ జనించిందాంటే, దీనిమాహాత్మ్యం ఏపాటిదో తెలియదు. ఒకరికొకరు బలిఇచ్చుకొని అయినా తమ ప్రేమే ఎక్కువైందని చూపించుకోడానికి ప్రయత్నంచేస్తూ ఉంటారు. ఈలాటి ప్రయత్నాలతోనే లీలారంగల సమయం తెలియకుండా గడిచిపోయింది. కాలం పూర్వాచార పరాయణులైన తలిదండ్రులే అయినయెడల వీరల స్వర్గానందం నరకయాతనకింద పరిణమించి ఉండేదేకాని ఆర్యసమాజకులైనందున వీరి కేలాటిబాధా కలుగలేదు. వైదికకాలంనాటి మనపెద్దలు అవలంబించిన ఆచారాలనే అవలంబిస్తూ తమ సంతానంచేతగూడ ఆలాగే చేయించవలెనని సమాజకుల ముఖ్యోద్దేశము. ఈ కారణంచేత పద్మాకృష్ణులు తమ బిడ్డల సుఖజీవనానికి తోడ్పడుతూ వచ్చారుకాని విఘ్నాలు కల్పించాలని ఎంచలేదు. ప్రేమిప్రేమికలకూ ఇంతమాత్రం పందుదొరికితే ఇక కావలసిందేమిటి? రాజధాని పట్నంలో లీలాలక్ష్మలతో గలసి రంగారావు దర్శింపని సినీమాలూ, వీక్షింపని నాటకాలూ, విహరింపని సముద్రతీరాలూ, సంచరించని పార్కులూ, గానింపని బోటుషికార్లు, ఆలకింపని వీణా

గానసభలు, అనుభవించని ప్లెజర్ ట్రిప్పులు, ఆరగించని ఉద్యానవనభోజనాలు లేనేలేవు. తరుచుగా భువన పూర్ణులు ఈ పార్టీతోనే ఉంటారు. ఈలాగే మఱికొన్ని రోజులు గడిచిపోయి వుండినయెడల లీలారంగ మైత్రి వివాహరూపంగా పరిణమించి వీరి ప్రేమవృక్షానికి పూలూ, మొగ్గలూ, పిందెలూ పుట్టేవే. కాని అందుల కొక మహా విఘాతం సంభవించి, వీరిద్దరిసౌఖ్యాన్నే కాదు, ఈ కుటుంబంవారి అందరిసౌఖ్యాన్ని గూడ నాశనంచేసి వేసింది.

లక్ష్మీచందు విదేశాలకు బోవడానికి తటపటలాడుతూ ఉండి కొన్నాళ్లకా అభిప్రాయం వదలి చదవడం మొదలిడిన తరువాత ఇతని ఉద్దేశం మారిపోయినందుకు తలిదండ్రులు సంతోషించారని పైన వ్రాసి ఉన్నాను. పైకగపడినలాగు ఇతని విదేశభ్రమణాభిలాష - పరదేశాల్లో తిరగాలనే పిచ్చి- మనసులోనుంచి పోలేదు. ఇంటర్ పరీక్ష కావడం తోటే ఆ ఉద్దేశం మరింత తీవ్రంగా మళ్ళీ జనించింది. దీన్ని పూర్తిచేసుకోడానికి ఇతడు చేసిన అవిచారమైన, అనుభవరహితమైన చిన్నతనపుచేత వల్లనే ఈ కుటుంబంవారనుభవిస్తూ వచ్చిన ఆనందరసవాహిని ఒక్కనిమిషంలో అంతరించి పోయింది. రంగారావుకు వ్యవహారపు తాళంచేతులను ఒప్పగించి నిశ్చింతతో దైవధ్యానంలో మునిగి కాలం గడుపుతున్నాడు కృష్ణచందు. క్రమక్రమంగా రావుజీమీదే పడింది భారమంతా. తక్కిన సమయాల్లోలాగు వ్యవహారపు వేళలందుగూడ లక్ష్మీచందు రావుజీ పక్కనే ఉంటాడు గాని యెల్లప్పుడూ పరధ్యానమే. వర్తకపు పనుల్లో ఇతనికి రుచి వున్నలాగు కనబడదు. ఇందులకు ముఖ్యకారణం విదేశానికి పోవాలని పట్టుకుంది చింత. పరీక్షల పరిణామాలు కొద్దిరోజుల్లోనే బయటపడతాయి. అప్పుడితని కో ఆలోచన తట్టింది. ముత్తాతగారి దగ్గిరికి అహమదాబాదు వెడతానని అందరితో జెప్పి, బయల్దేరి బొంబాయిలో దిగి అక్కణ్నుంచి తిన్నగా యూరోపుచేరుకోవాలనీ సంకల్పం. కాని ధనమో? తలిదండ్రులతో, రావుజీతో చెప్పితే వెనకలాగే అవుతుందని భయం, అందుచేత ధనంకోసం మరో ఉపాయం పన్నేడు, ఎవరికీ తెలియకుండా కావలసిన రొక్కం తీసుకొని తర్వాత అందరికీ తెలియచేయాలనీ. రావుజీతాళంచేతులూ, తండ్రివద్ద డూప్లికేటు తాళంచేతులూ ఎక్కడ ఉండేదీ ఇతనికి బాగా తెలుసు. అనేకమాట్లు ఇతనికీ ఇనపపెట్టెలు తీయడం వేయడం వాడుకే. ఇంటికైన పెద్దకొడుకూ, యజమాని తర్వాత యజమానంతవాడూ ఇతడేం చేస్తూ ఉంటే ఎవరేం అనుమానపడతారు? కాబట్టి వెళ్లేనాడు కావలసిన ద్రవ్యందీసుకొని జాగ్రత్త చేసుకోవలెనని ఏర్పరుచుకొన్నాడు ప్లాను. ఇంట్లోవాళ్ళకేం తెలుస్తుందీ ఈసంగతి? అందరూ అహమదాబాదే వెళ్లుతాడనుకొన్నారు. అందుకనే తలిదండ్రులితని ప్రయాణానికి మారుమాటాడక సమ్మతించారు. చివరకు ప్రయాణం దినం వచ్చింది. రాత్రి ౯-౩౦ మెయిల్లో బయల్దేరి బొంబయిచేరి అక్కణ్నుంచి గుజరాతు మెయిల్లో అహమదాబాదు చేరాలని పైకేర్పరుచుకొన్న ఏర్పాటు. పగలంతా ప్రయాణపుసన్నాహాలవుతూనే ఉన్నాయి. ప్రయాణానికి గావలసిన ఆహారపదార్థాలూ, మిఠాయీలు తయ్యారు చేస్తున్నారు హల్వాయీలు. డ్రెస్ ట్రంకులు, ఆహారపదార్థాల ట్రంకులు, అపరూపపు పదార్థాల కేసులు, పుష్పఫలాదులబుట్టలు, పుస్తకాల బేగులు, బెడ్డింగులు మొదలగు సామాన్లను సర్దడంతోటే సరిపోయింది దినమంతా. వెళ్లేది ఒక్కలక్ష్మి.

ఈలాటి లక్ష్మీపుత్రులే లేకుంటే రైల్వేస్టేషన్లలోని లైసెన్సుకూలీలగతి ఏంగావాలీ? రంగారావు ఏదో పనిమీద వెలుపలికి వెళ్లి ఉండగా తండ్రి మేడమీద ఉండడం గనిపెట్టి తన మనోరథాన్ని నెరవేర్చుకొన్నాడేలాగయితేనేం, ఇతడు. ముప్ఫైనలభై వేల రూపాయలు ఇనుపపెట్టె బందీనుంచి తప్పించుకొని లక్ష్మీచందుచేతిబేగును అలంకరించాయి. ఒకవారం గడవకముందే ఈ వార్తను తండ్రికీ, రంగారావుకూ తెలియచేద్దామనే ఆలోచనేకాని ఇంతలో ఏకొంపమునిగేదీ యోచించలేదు. కొత్తకొత్తదేశాలూ, అక్కడివింతలూ, విశేషాలూ చూడవలెనని అనివార్యమైన అభిలాష జనించడం మనుష్యస్వభావాల్లో ఒకటే. ఈ ఇచ్ఛాపూర్తిని అనేకులనేకవిధాల చేసుకొంటూవుంటారు. బొత్తుగాచేసుకోలేనివాళ్లు

దేవురిస్తూనే ఉంటారు. దగ్గర కావలసినంత ధనం లేక పోయినప్పటికీ, స్థితిగతు లనుకూలించకపోయినప్పటికీ, ఏ అనివార్య హేతువుచేతనో, ఏ అప్పుసప్పు చేసి, రైళ్లు మొదలైన వాటిమీద ప్రయాణంచేస్తూ ఉండేవాళ్ల మొగాలమీద తొలుకాడుతూఉండే సంతోష వికాసాలను చూస్తే స్పష్టమౌతుంది, ఈనవీన విశేషదర్శనాభిలాష, ఈనూతనప్రదేశావలోకనకుతూహలం, మనుష్యుల్లో ఎంతప్రబలంగా ఉండేదీనీ.

యూరోపు అమెరికా నివాసులు బాలకుల విద్యాభ్యాసకాలంలో యువకుల విద్యాపూర్తి అయిన తర్వాత ఇలాటి విదేశదర్శనావకాశాలను సమకూర్చి ఈ పిపాసను కొంతవరకు తీరుస్తున్నారు. ఈ యభిలాషాపూర్తికి తగిన ఏర్పాట్లను మనపూర్వులుకూడ చేసిఉన్నారు. గృహస్థాశ్రమం స్వీకరించే పర్యంతం విద్యాభ్యాసం నిమిత్తం విదేశాలకు వెళ్లాలనీ, తరువాత ఆమరణాంతం తీర్థాలనూ, పుణ్యక్షేత్రాలను సేవించాలనీ మనపెద్దలు చేసిన ఏర్పాట్లఅభిప్రాయం ఏమై ఉంటుంది? వీటి కింకనూకొన్ని కారణా లుండవచ్చునుకాని వాటిలో తప్పకుండా ఇదికూడా ఒక కారణం. ఏమైతేనేం? తన వివేకం, తన వినయ సౌజన్యం, తన గురుజనానురాగం, తనమిత్రవాత్సల్యం లోనగు సద్గుణాలను ఈ ఆశాదేవికి బలిఇచ్చి బయల్దేరాడు లక్ష్మీచందు. ఏడేనిమిది గంటలకు భోజనాలయ్యాయి. ఆసమయాన్ని శ్రీచందు మొదలగు బంధువులకు నోటిద్వారా పంపవలసిన సందేశాలు. నమ్రతాపూర్వక ప్రణామాలు ఇచ్చారు తలిదండ్రులు. అమాయికలు తమ్ములూ, లీలా నొక్కినొక్కి చెప్పారు తాతగారికి చెప్పవలసిన మాటలన్నీనీ పరధ్యానంగా వీటి కన్నింటికీ ఊంకొట్టాడు లక్ష్మీ.

ఒకటాక్సీలో సామానంతా వేయించుకొని అహమదాబాదుకు పోవలసిన ఇద్దరు నౌకర్లనూ వెంటబెట్టుకొని గుమాస్తాతొమ్మిది కాకపూర్వమే సెంట్రల్ స్టేషను వెళ్లిపోయ్యాడు, సామానంతా లగేజీచేయించి టిక్కట్లుకొని సిద్ధంగా ఉండడానికి. తొమ్మిదిం బావుకల్లా తండ్రీకొడుకులు రంగారావుతోకలిసి స్టేషనుకు వచ్చేసరికి అంతా సిద్ధంగా ఉంది. మూడోక్లాసు టిక్కట్లను నౌకర్లకిచ్చి వాళ్ళను సర్వెంట్స్ కంపార్టుమెంటులో ఎక్కించి, ఇంతలో ఫస్టుబెల్ కాగా లక్ష్మి తన టిక్కట్టునూ, సామాను ప్యాసును జేబులో వేసికొని తన ఫస్టుక్లాసు రిజర్వుడుసీటు మీదికి పోయి చేరాడు. మరి రెండునిముషాల్లో గార్డు విజిల్ ఇవ్వడంతోటే కొడుకును తండ్రితో, మిత్రుని మిత్రునితో ఎడబాపి లాక్కెళ్లింది దయాదాక్షిణ్యాలు లేనిపాడురయిలూ. కృష్ణచందు రావుజీ లిద్దరూ చిన్నబోయి చూస్తూ గార్డుబండికూడా దాటిపోవడంతోటే వెనక్కి మళ్లారు. కొద్దికాలంవరకైనప్పటికీ ప్రియజన విరహదుఃఖం అసహ్యంగానే ఉంటుంది.

౩

లక్ష్మీచందు ఇంటివద్దిరినుంచే నౌకర్ల బాధ లేకుండా చేసుకోడానికి చాలావట్టుకు ప్రయత్నించేశాడు కాని వీలైంది కాదు. ఇక్కడ ఎక్కి అక్కడ దిగడం కూడాకాదు, అహమదాబాదు ప్రయాణం. మరీబలవంతం చేసి వద్దంటే తండ్రి ఏం అనుమానపడిపోతాడో అని అప్పటికి మాత్రం తూష్ణీంభావం వహించి, బొంబాయి అహమదాబాదుల మధ్య వీళ్ళకు సెలవిప్పించడానికి నిశ్చయించుకొన్నాడు. ముందుగానే టెలిగ్రాములు వచ్చి ఉండడంచేత బొంబయిలోని వీరి మేనేజరు, మరికొందరు గుమాస్తాలూ రైలుదగ్గిరికి వచ్చి కలుసుకొన్నారు విక్టోరియా టెర్మినసులో దిగడంతోటే. వీరందరూ రెండు మూడురోజులు బొంబాయిలో ఉండమనికూడా ప్రారంభించారు. కాని తొందరపను లున్నాయని మిషపెట్టి లక్ష్మీ వారినుండి తప్పించుకున్నాడు. అక్కడ దిగిననాటి రాత్రే అహమదాబాదు ప్రయాణం. రాత్రికి ౮-౩౦ కి గుజరాతు మెయిల్ బయల్దేరుతుంది. యానత్తూ తయార్లు చేసుకొని అరగంటముందుగానే కొలాబాస్టేషన్వద్ద జేరి టిక్కట్లు తేవడానికి మేనేజరు సిద్ధమయితే అతన్ని వారించితానే వెళ్లి సూరతువరకూ తన నిమిత్తం ఒకఫస్టుక్లాసు టిక్కట్టూ, నౌకర్లకు అహమదాబాదువరకూ రెండు మూడోక్లాసు టిక్కట్లనూ కొని వారివి వారికి ఇచ్చి, బరిడి తయార్లుగానే ఉన్నందున వెళ్లి ఎవరి బండ్లలో

వారు కూర్చున్నారు. వెంట తీసుకొనిపోవాలనుకొన్న సామానంతా తనదగ్గిరే పెట్టించుకొన్నాడు లక్ష్మి. సరిగ్గా ౮-౩౧కి రైలు కదిలింది. సూరత్ చేరేటప్పటికి ౧౨-౩౦ కావచ్చింది. కార్యాసక్తులకూ, కామాసక్తులకూ నిద్ర వస్తుంది గనుకనా. లక్ష్మి మేలుకొనే ఉన్నాడు. కాని గురకలు బెట్టి నిద్రబోతున్నారు నౌకర్లు, ఏయూలలో దేహాల్ని ఆనించి; వారికి ప్రపంచపుగొడవే లేదు. నిద్రకూడా మహా విచిత్రమైందే! హాయిగా ఇంటిపట్టున పట్టెమంచం,పట్టుపరుపుమీద ఈ శరీరాన్ని జేరేస్తే అటుపొర్లడం, ఇటుదొర్లడం- ఇంతేగాని, కంటికింపైన నిద్ర రానేరాదు ఎంతసేపటికీనీ. ఇక రైల్లో ఎక్కామా అంటే నిలుచోడానికి చోటు లేకపోయినా సరే, కళ్లు మూరుకొనే పోతూ ఉంటాయి. సూరతుస్టేషన్ రావడంతోటే లక్ష్మి దిగి పోర్టర్ల చేత సామాను బట్టించుకొని వెయిటింగురూంలో చేరాడు. పది నిముషాలుండి బండి కదిలిపోయింది. అప్పటికి కుదుట బడింది ఇతని మనస్సు. మళ్లీ అక్కణ్నుంచి బొంబయికి టిక్కట్టు తీసుకొని మూడుగంటలకు అక్కడికి వచ్చే పెషావరు ఎక్స్‌ప్రెస్ మీద తెల్లవారి ఎనిమిదిగంటలకు బొంబయి చేరాడు. దినమంతా విదేశయాత్రకు అవసరములైన ప్యాసుపోర్టూ, డాక్టరు సర్టిఫికేట్లూ, టిక్కెట్లూ మొదలైనవాని సమకూర్చుకోడంతోటే సరిపోయింది. సుమారు రెండుమూడు గంటలకు లంగరు ఎత్తివేశారు. అనంతసముద్రంలో లీనమైపోయింది. లక్ష్మి ఎక్కినస్టీమరు-సిటీ ఆఫ్ పారిస్.

ఇక్కడ మద్రాసులో లక్ష్మి వెళ్లిపోయిన సంగతి అందరికీ తెలిసిపోయింది. కాని ఎక్కువకష్టమనిపించింది లీలారంగలకు. వీరెక్కడికి వెళ్లినా లక్ష్మి తప్పకుండా వుండేవాడు. ఇప్పుడతను లేనిలోపం బాగా కనబడుతూవుంది. మర్నాడు యథాప్రకారం వ్యవహారాలన్నీ సాగిపోయ్యాయి. కాని అవసరమేమీ రానందున లక్ష్మి చందు డబ్బుతీసిన పెట్టెను ఆనాడు సాయంకాలంవరకూ ఎవరూ తెరిచారుకారు సాయంత్రం ఆరుగంటలైనతరువాత రావుజీ ఎక్కడికో వెళ్లిపొయ్యాడు మామూలు ప్రకారం. ఇతడు వెళ్లగానే కృష్ణచందుకేదో అవసరం మీద ద్రవ్యం కావలసివచ్చింది. అతడు శివసుబ్రహ్మణ్యంగారిని ఆపెట్టెనే తెరిచిచూశాడు. లోపలంతా ఖాళీగా వుంది. ఏనాలుగైదునోట్లో ఇవతలా అవతలా చెదరిపడివున్నాయి. ఈయన మనస్సునకేదో చప్పున సందేహం తట్టింది. తక్కిన పెట్టెలనూ తెరచిచూశాడు. అవన్నీ సరిగ్గానే ఉన్నాయి. మొదట తెరచిన దాంట్లోనే లేనివి లేక పోగా ఉన్నవి అస్తవ్యస్తంగా పడివున్నాయి. ఆఫీసులోని నౌకర్లందరూ వెళ్లిపొయ్యారు మేనేజరు మాత్రం ఇంకా ఉన్నాడు. ఆయన్ని పిలిపించి లెక్కల పుస్తకాల్ని దీయించి చూస్తే క్రిందటి సాయంకాల మందులో నలభైవేల ఆరునందలరూపాయల రొక్కం జమ వుంచినలాగు వ్రాయబడి వున్నది. ఖర్చైనలాగు ఎక్కడనూ లేదు. క్షణక్షణ మితనిమనసులో ఒకవెర్రి ఆందోళనం వృద్ధికావడం మొదలెట్టింది. మేనేజరును వెళ్లిపొమ్మన్నాడు. ఆఫీసు ఖాళీ అయిపోయింది. ఏమి టీచిత్రమని ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఏలాగూ పాలుపోవడం లేదు. "తాళంచేతులు రావుజీ దగ్గరేకదా ఉంటూ, అతనికి తెలియకుండ ఈపని యేలాగు జరిగి ఉంటుంది? కాని ఈవిషయమై అతనిదగ్గిర ఎత్తేది ఏలాగూ? సర్వస్వమూ అతనికే వప్పచెప్పినప్పుడూ అతని కీలాగు చేయవలసినఅవసరం ఏమిటీ? రెండేళ్లనుంచీ చూస్తూన్నాను. ఏకరసంగా ఉంది అతని సద్వర్తనము. నా బలవంతంమీద ఏమైనా దీసుకొనేవాడు. కాని స్వతంత్రించి కానైనా తననిమిత్తం దీసికొని యెరుగడు. అలాంటి వానిమీదనా నాకు అపనమ్మకం" అని కొంతసేపూ, "ఏమిటో మానవస్వభావం గదా. ద్రవ్యంతో గూడిన పని. ఏదో అవసరం కలిగి ఇవ్వాళే చూశానుకాని ఇదివర కెన్నిమారులైందో ఈలాగు"అని మరికొంతసేపూ, కొత్తవాడేయని లేశమైన విచారించకుండాసర్వస్వాతంత్ర్యమిచ్చాను.అట్టివన్నీ లాగువెర్రివాణ్ని చేస్తాడారంగారావు" అని కొంతసేపూ, "ఛీ! నేడు నామతి కేమి వచ్చింది! నా ఆత్మమీద నాకు అపనమ్మకం కలిగినయెడల రావుజీ మీద అపనమ్మకం కలగాలి" అని కొంతసేపూ-ఏమేమో యోచిస్తూ కూర్చున్నాడు. ఇంతలో దీపాలు పెట్టిన తర్వాత రంగారావు వచ్చి ఆఫీసులో ఒంటరిగా కృష్ణచందు కూచోని ఉండడం చూచి తిన్నగా ఆయనదగ్గిరకే వెళ్లాడు. అతన్ని చూడడంతోటే-

"రావుజీ; ఖజానా తాళంచేతులు ఉన్నాయా?"

"ఆ! నావద్దనే ఉన్నాయి."

"ఏవీ! ఈలా ఇయ్యి." అని తీసుకొని, "రావుజీ! ఈపెట్టెలో ద్రవ్యం ఎంత ఉండాలిసిందీ తెలియునా?"

"ఏపెట్టెలో?"

"ఇదే! నాలుగో నెంబరుది. మనం కొత్తగా దెప్పించుకొన్నది."

"అందులో నలభై వేలకంటే ఎక్కువ వుండాలనీ నా జ్ఞాపకం. అసలు మొత్తంలెక్కలు చూస్తే తెలుస్తుంది."

"ఇలాగు చూడు - ఈపెట్టెనీ!"

"ఏం" అని దగ్గిరికెళ్లి చూసేసరికి పెట్టంతా ఖాళీ. నోట్లప్యాకెట్లు లేవు. నిన్నసాయంకాలం నాలుగుగంటలవేళ లక్ష్మికి ఇవ్వడానికి వెయ్యిరూపాయల నోట్లు తీసికొని తక్కినవాటి నన్నింటినీ అదేచోట తానే పెట్టాడు. ఇప్పుడంతా శూన్యం. గుండె గుభేలుమంది. తన మేనేజిమెంటు సమయంలో జరిగిందని మొగం వివర్ణమైపోయింది. నిర్ఘాంతపోయి నిలుచున్నాడు.

"ఏమైందా పైకమంతా మరీ?"

"నాకేమీ పాలుపోకుండాఉంది."

"తాళంచేతులు మీదగ్గరే కదా ఉంటాయి?"

"అవును. ద్రవ్యమేలాగున మాయమైందో నాకేమీ గోచరం కావడంలేదు."

"మీకు తెలియకుండా ఏలా పోయివుంటుంది."

"నేనేమని చెప్పేదీ?"

"వందా రెండువందలూ కావు. నలభై వేలూ గుండంచేసుకొని పోవడమే ఒక్కపాళంగా?"

ఇది విని రావుజీనోటినుంచి మాట రాలేదు. దిగ్భ్రాంతి చెందినవానివలె నిలుచున్నాడు. అప్పుడు కృష్ణచందు మరల చింతతోగూడిన మొగంతో, "ఈ విషయములో నాకు గలుగుచున్న ఆందోళనము ఇంతింతని చెప్పలేను. లక్ష్మికంటే మీమీద నాకెక్కువవిశ్వాసం. నాసర్వస్వం మీఆధీనం చేశాను. స్వశక్తిమించిన ఉపకారం మీకు చేయాలని ఉండగా ఈఆఘాతం తగిలింది. కొన్నిసంవత్సరాలైనా నాకేమీ తెలిసే ఉండదు. కాని ఒక్కపర్యాయం నలభై వేలరూపాయలు కన్పించకపోవడమూ,—ఎల్లప్పుడూ తాళంచేతులను దగ్గిర ఉంచుకొనే మీ కా సమాచారం తెలియకపోవడమూ. పరమేశ్వరునకే తెలియాలి ఈరహస్యం" అన్నాడు. ఈ మాటలు రంగారావు హృదయంలో శూలాల్లాగు గుచ్చుకొన్నాయి. సంభావితుడైన పురుషునికి అపనింద మరణంకంటే మించింది. ఇతనికి జవాబు చెప్పడానికే నోరాడలేదు. చెప్పేదేమిటి? పుణ్యం పాపం లేశమాత్రమైనా తెలిస్తేనే కదా. మరి రెండునిముషాలూరకుండి కృష్ణచందు కొంచెం గాంభీర్యం వహించిన మొగంతో, "ఇప్పుడీవిషయాన్ని బయలుపెట్టిన యెడల యేలాగు పరిణమించేదీ మనకు తెలుసును. కాని ఇంకో నలభై వేలు పోయినప్పటికీ నేనేలాటిపని చేయను. మీరు నాకు పరమాప్తులు. మీ మీద నా కెంతమాత్రం అవిశ్వాసం కలగడంలేదు. కాని నామనస్సునకేదో కళవళం కలుగుతున్నది. నిజం నిక్కడమీద తెలియకపోదు. కొన్నాళ్లలో ఈ సంగతి తప్పక బయలుపడుతుంది. అంతవరకూ మన వ్యవహారాలు నేనే చూస్తూఉంటాను. మీకు చేతిఖర్చు నిమిత్తం ఈరొక్కాన్ని తీసుకోండి" అని కొంతపైకమివ్వబోవ రావుజీ "అక్కర్లేదు. ఇప్పుడు నావద్దద్రవ్యమున్నది. కావలసినపుడు అడిగి తీసుకొంటాను." అన్నాడు. ఇంతలో భువనుడేతెంచి, "నాన్నా! పండితుగారు పూజను ముగించి హారతి యివ్వడానికి నీకోసం చాలాసేపట్నుంచి కనిపెట్టుకుని ఉన్నా"రని చెప్పగా రావుజీనికూడా లెమ్మని చెప్పుతూ మేడమీదికి వెళ్లాడు కృష్ణచందు. ఒక అరగంట అయినతర్వాత మరోనౌకరు వచ్చినాడు రంగారావును భోజనానికి పిలవడానికి. కాని ఎక్కడున్నాడు రావుజీ. ఆఫీసులోలేడు. మేడమీద లేడు. అతని గదిలో లేడు. ఇంటివెలుపలా లేదూ, లోపలా లేడు. రావుజీ కానరాక, అతనిజాడ అయినా తెలియక, రెండురోజులు గడచిపోయాయి. అతడు మామూలుగా వెళ్లుతూఉండే పట్నంలోని స్నేహితుల ఇండ్లలోగాక చుట్టుప్రక్కల ఏయే ప్రదేశాలకు వెళ్లడ మతని కలవాటో అక్కడంతా వెతికారు.